సాక్షి
చిత్తూరు

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక

తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం కే.కళావతి పేర్కొన్నారు. - IIలో



పంట పొలాలపై ఏనుగుల దాడి

పులిచెర్ల మండలంలో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. పంట పొలాలను తొక్కి సర్వనాశనం చేస్తున్నాయి. - IIలో



ఇండస్ట్రియల్ విజిట్‌కు

ఇండస్ట్రియల్ విజిట్‌కు తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విద్యార్థులు వెళ్లారు. - IIలో

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన నూతన ఎస్పీ



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న నూతన ఎస్పీ తుషార్ డూడి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నూతన ఎస్పీ తుషార్ డూడి కలెక్టర్‌ను కలిశారు. ఈ మేరకు శనివారం ఆయన కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీని మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతలకు సంబంధించి చేపట్టాల్సిన పలు అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు.

రేపటి నుంచి దసరా సెలవులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు ఈనెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటిస్తున్నట్లు డీఈవో వరలక్ష్మి వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు(మైనారిటీ పాఠశాలలు తప్ప) కచ్చితంగా దసరా సెలవులను అమలు చేయాలన్నారు. సెలవుల్లో ఎలాంటి ప్రత్యేక తరగతులు నిర్వహించరాదన్నారు. జిల్లాలోని మైనారిటీ పాఠశాలలకు ఈనెల 27 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు సెలవులు ఉంటాయని తెలిపారు. జిల్లాలోని డీవైఈవోలు, ఎంఈవోలు ప్రైవేట్ పాఠశాలల్లో తరగతులు నిర్వహించకుండా ప్రత్యేక నిఘా పెట్టాలని డీఈవో ఆదేశించారు.

పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీలో ప్రజలకు మెరుగైన వైద్యం అందజేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ ఆదేశించారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అన్ని కాన్పులు ఆస్పత్రుల్లోనే జరిగేలా శ్రద్ధ వహించాలన్నారు. గర్భిణులకు తప్పనిసరిగా అభ ఐడీ నమోదు చేయాలని చెప్పారు. ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకంలో మొదటి కాన్పులో ఇద్దరు ఆడ పిల్లలకు రూ.6 వేలు తప్పక అందించాలన్నారు. పీహెచ్‌సీ డాక్టర్‌లు విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సుధారాణి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పద్మాంజలి, వైద్యాధికారులు వెంకటప్రసాద్, హనుమంతరావు, అర్పిత పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలు గాలికి



మాజీ డిప్యూటి సీఎం నారాయణస్వామి

పాలసముద్రం: కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలను గాలికొదిలేసిందని మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి ధ్వజమెత్తారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విష జ్వరాలతో ప్రజలు విలవిల్లాడుతున్నా, కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. ఇదే తరుణంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు. జగనన్న 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తే, చంద్రబాబు తన 15 ఏళ్ల పాలనలో ఒక్క ప్రభుత్వ మెడికల్ కళాశాలను కూడా తీసుకురాలేదని ఎద్దేవా చేశారు. పేదవాడికి వైద్యం అందకుండా చేయాలనే కుట్ర పన్నుతున్నట్టు ఉందని చెప్పారు. సంపద సృష్టిస్తానని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రూ.8 వేల కోట్ల విలువ చేసే 17 మెడికల్ కాలేజీలను తన బినామీలకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు.

విధులు బాధ్యతగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఈవో వరలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్లు తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని డీఈవో వరలక్ష్మి ఆదేశించారు. ఆమె శనివారం సంతపేటలో ఉన్న పీఎన్‌సీ మున్సిపల్ పాఠశాలలో నిర్వహించిన సీఆర్‌సీ సమావేశాన్ని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. 100 శాతం ఉత్తీర్ణతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

బంగారుపాళ్యం మొగిలి ఘాట్ వద్ద రెండు రోజులకు క్రితం ఓవర్ లోడ్‌తో పలమనేరు వైపు నుంచి వస్తున్న ఓ గ్రానైట్ లారీ ఇంకో లారీని ఢీకొట్టింది. ఆ లారీ బిల్లులను తనిఖీ చేయగా చిత్తూరు అసోసియేషన్ పేరిట ఉంది.
తీరా.. దాన్ని పూర్తి స్థాయిలో పరిశీలిస్తే అది దొంగ బిల్లు అని తేలింది.

... జిల్లాలో ఇదొక్కటే కాదు. వందలాది లారీలు దొంగ బిల్లులు సృష్టించుకుని గ్రానైట్‌ను విచ్చలవిడిగా తరలిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిని కట్టడి చేయాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో కూరుకుపోయి అటువైపు కన్నెత్తి చూసేందుకూ తీరిక లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



గ్రానైట్.. రైట్ రైట్!

- చిత్తూరు జిల్లాలో విచ్చలవిడిగా గ్రానైట్ దోపిడీ
- సీనరేజ్ లేదు.. అన్నీ దొంగ బిల్లులే
- బిల్లుల్లో కూటమినేతల హస్తం
- చిత్తూరు కేంద్రంగా నడుస్తున్న వైనం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వంలో అక్రమాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. ఇందులో భాగంగానే ఇటీవల గ్రానైట్ అక్రమ తరలింపు వ్యవహారం పెచ్చుమీరుతోంది. ప్రభుత్వానికి రావలసిన రాయల్టీ చెల్లించకుండా అక్రమార్కులు అడ్డదారిలో గ్రానైట్‌ను తరలిస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారు. గ్రానైట్ రాయి అక్రమ తరలింపు వ్యవహారంలో అక్రమార్కులు అడ్డదారులను ఎంచుకుంటున్నారు. ఎక్కడికక్కడ తమ మనుషులతో గస్తీ నిర్వహిస్తూ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటున్నారు. జిల్లాలో లభించే గ్రానైట్ రాయిని అక్రమంగా లారీల ద్వారా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. జిల్లాలో 400 వరకు క్వారీలు నడుస్తుండగా.. ఇందులో చాలా చోట్ల కోట్లాది రూపాయల విలువ చేసే గ్రానైట్ దిమ్మెలు మాయమవుతున్నాయి. చిత్తూరు, యాదమరి, బంగారుపాళ్యం, పాలసముద్రం, కుప్పం, గంగాధరనెల్లూరు, ఎస్‌ఆర్‌పురం, పూతలపట్టు తదితర మండలాల నుంచి ఈ వ్యవహారం జోరుగా సాగుతోందనే ఆరోపణలు వినిస్తున్నాయి.

గ్రానైట్ తరలింపునకు ఇలా...


క్వారీల నుంచి గ్రానైట్ దిమ్మెలు బయటపడితే.. వాటి విలువను అధికారులకు నివేదించుకోవాలి. తరలింపునకు అనుమతులు తీసుకోవాలి. ఈ మేరకు మైనింగ్ శాఖ అధికారులు గ్రానైట్ బండను కొలతలు వేసి లెక్కకట్టాలి. తర్వాత ఆన్‌లైన్ ద్వారా అనుమతులువస్తాయి. ఆపై రాఘవకన్‌స్ట్రక్షన్ రాయల్టీ కడితే తరలింపునకు అనుమతులు లభిస్తాయి. దీంతో పాటు క్వారీ నిర్వాహకులకు స్టేషనరీ నిర్వహణ ఉంటుంది. బార్‌కోడ్‌తో ఉన్న ఈ బిల్లుల్లో గ్రానైట్ తరలింపు వివరాలు పొందుపరచాలి. అయితే వీటిని లెక్కచేయకుండా కొందరు కూటమి నేతలు కాసులు దండుకునే పనిలో పడ్డారు. అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్నారు.

అధికారులకు పట్టదా..?



గ్రానైట్ ఆక్రమ తరలింపును అడ్డుకునేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. దీన్ని కట్టడి చేయాల్సిన అధికారులు నిద్రావస్థలో ఉంటున్నారు. గ్రానైట్ లారీలు రాష్ట్ర సరిహద్దులు దాటుతున్నా.. అధికారులు మామూళ్ల మత్తులో పడి చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. భూగర్భ గనుల శాఖ అధికారులు వీటిపై దృష్టి పెడితే ఈ అక్రమాలకు ఎప్పుడో చెక్ పడేది. ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోపాటు అక్రమార్కుల నుంచి ముడుపులు తీసుకుని అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

దొంగబిల్లుల రారాజు ఎవరు?



ఓ అసోసియేషన్ పేరుతో ఉన్న గ్రానైట్ బిల్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొందరు నేతల కన్ను గ్రానైట్‌పై పడింది. వారు క్వారీలపై పడి కాసులు పిండుకునే పనిలో నిమగ్నమైపోయారు. ఈ క్రమంలో రాయల్టీ వసూళ్లకు బాధ్యతలు ఉన్న సంస్థను తోసిపుచ్చారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని బిల్లులే లేకుండా చాలా వరకు గ్రానైట్‌ను అమ్ముకుంటున్నారు. దీనికితోడు దొంగ బిల్లులతో గ్రానైట్ దందాకు ఆజ్యంపోస్తున్నారు. సంస్థలు, అసోసియేషన్లను తెరపైకి తీసుకొచ్చి గ్రానైట్ దందాల్లో కోట్లాకు పడగెత్తుతున్నారు. తద్వారా రాయల్టీకి డుమ్మా కొడుతున్నారు. అయితే ఈ బినామీ సంస్థకు రూపశిల్పి... ఆ 'రా' రాజు ఎవరనేది ఇప్పుడు జిల్లాంతా హట్‌టాపిక్‌గా మారింది.

> **మాకు సంబంధం లేదు**
>
> ఆ బిల్లు చూశాం. అసోసియేషన్ పేరుతో ఉన్నాయి. దానికి మాకు ఎటువంటి సంబంధం లేదు. అదేదైనా ఉంటే వాళ్లను అడగండి. మాకు ఫిర్యాదులు వస్తే కచ్చితంగా స్పందిస్తాం. చర్యలు తీసుకుంటాం. తనిఖీలు చేస్తున్నాం.
>
> –సత్యనారాయణ, మైనింగ్‌శాఖ డీడీ, చిత్తూరు

ఎన్‌ఎంఎంఎస్
రెన్యూవల్‌కు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో 2024 డిసెంబర్ 8న నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలో ఎంపికైన విద్యార్థులు రెన్యూవల్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు శనివారం డీఈవో కార్యాలయానికి ఉత్తర్వులు పంపారు. ఆ ఉత్తర్వుల మేరకు 2021, 2022, 2023 సంవత్సరాల్లో ఎంపికై గత సంవత్సరం నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో అప్లికేషన్ నమోదు చేసుకున్న విద్యార్థులకు మరొక అవకాశం కల్పించారు. నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో ఈ నెల 30వ తేదీలోపు రెన్యూవల్ చేసుకునేలా వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ సంవత్సరంలో 10, 11, 12 తరగతుల ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాలయాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు తప్పకుండా రెన్యూవల్ చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తన బ్యాంక్ ఖాతా, తన ఆధార్ నెంబర్‌కు సీడ్ చేయించుకుని డీబీటీ రూపంలో నగదు జమ అయ్యేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు డీఈవో కార్యాలయంలోని పరీక్షల విభాగంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యుత్ అంతరాయాలు తగ్గించండి



సమావేశంలో ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్, ఈఈలు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ అంతరాయాలను తగ్గించాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. శనివారం విజయవాడ నుంచి ఎస్‌ఈ, ఈఈలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లా ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయం నుంచి ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈలు సమావేశానికి హాజరయ్యారు. ప్రజల్లో విద్యుత్‌శాఖ పై సానుకూలత పెంపొందించే విధంగా పనిచేయాలన్నారు. జిల్లాలో 60 శాతం వినియోగదారుల సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారని ఎస్‌ఈ తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల ఎక్కువగా అంతరాయాలు లేవన్నారు. గాలి వచ్చినప్పుడు మాత్రమే అంతరాయం వస్తోందన్నారు. పీఎం సూర్యఘర్ పథకం వినియోగం పై మరింత అవగాహన కల్పిస్తామన్నారు.

విద్యతోనే మెరుగైన జీవితం



స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర ర్యాలీలో కలెక్టర్ సుమిత్‌కుమార్

గుడిపాల: విద్య ద్వారా మెరుగైన జీవన విధానం పొందవచ్చని, ప్రతి గిరిజన కుటుంబంలోని పిల్లలందర్నీ బడికి పంపించి చదివించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం గుడిపాల పరిధిలోని అనుపు ఎస్టీ కాలనీలో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఓ మొక్కను నాటారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మండల స్థాయి అధికారులతో కలిసి గ్రామసభను నిర్వహించారు. గిరిజనుల స్థితిగతులు మార్పు చెందాలంటే వారి పిల్లలను కచ్చితంగా బడికి పంపించాలన్నారు. విద్య ద్వారానే ఉపాధి పొందవచ్చని చెప్పారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో వృద్ధి చెందాలన్నారు. కాలనీవాసులు తమకు పక్కా ఇళ్లు కావాలని కోరగా రెండు వారాల్లో చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. తహసీల్దార్, స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి శ్మశాన వాటిక దారి సమస్యను తీర్చడానికి త్వరలో సర్వే బృందాన్ని పంపుతామని హామీ ఇచ్చారు. తమిళనాడు నుంచి వచ్చిన వలసదారులకు వెంటనే ఆధార్ కార్డులు వచ్చేలా చర్యలు చేపడుతామన్నారు. చదువుకున్న యువతకు అమర రాజా ఫ్యాక్టరీలో శిక్షణ ఇప్పించి, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ఆడపిల్లలు కంప్యూటర్ విద్యకు సంబంధించి నైపుణ్య శిక్షణ పొందాలని, అందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పునరుద్ధరించి బాగు చేస్తామన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో కుమార్, డ్వామా ఏపీడీ సుబ్రమణ్యం, ఎంఈఓ హసన్‌బాషా, వ్యవసాయాధికారి సంగీత, డాక్టర్ సంధ్య, ఏఈలు ప్రసాద్, పవన్, శివకుమార్ పాల్గొన్నారు.

ప్రచార వాహనం ప్రారంభం



వాహనాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం ఎయిడ్స్‌పై అవగాహన కల్పించే ప్రచార వాహనాన్ని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి ప్రారంభించారు. ఈ వాహనం 15 రోజుల పాటు జిల్లాలో పర్యటిస్తుందన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పలు హైరిస్క్ కేసులు, జన సమూహ ప్రాంతాల్లో వీడియో ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఎయిడ్స్ నోడల్ అధికారి వెంకటప్రసాద్, అధికారులు హనుమంతరావు, ప్రవీణ, అనిల్‌కుమార్, అనూష, నవీన్‌తేజ్, వేణుగోపాల్, జార్జి, జయరాముడు, శ్రీవాణి పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం



చెత్త బండ్లను పరిశీలిస్తున్న సీఈఓ రవికుమార్

శ్రీరంగరాజపురం : గ్రామీణులు పరిశుభ్రతకు అధిక ప్రాధ్యాన్యమివ్వాలని జెడ్పీ సీఈఓ వి.రవికుమార్ అన్నారు. శనివారం మండలంలోని జీ.ఎం.ఆర్.పురం, శ్రీరంగరాజపురం పంచాయతీల్లో నిర్వహించిన స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం కింద పాతపాళ్యం దళితవాడకు రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరైనట్టు తెలిపారు. కొండపాళ్యం ఎస్టీ కాలనీలో మౌలిక వసతులకు నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జీ.ఎం.ఆర్.పురం, కొండపాళ్యం ఎస్టీ కాలనీకి నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డును పరిశీలించి, చెట్లను నాటారు. ఎంపీడీఓ వనజం, ఏఓ మోహన్‌మురళి, ఏఈ సునీల్, సర్పంచ్ చిరంజీవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంట పొలాలపై ఏనుగుల దాడి



బాలిరెడ్డిగారిపల్లెలో దెబ్బతిన్న వరి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కమ్మపల్లె పంచాయతీ, బాలిరెడ్డిగారిపల్లెలో శనివారం తెల్లవారు జామున ఏనుగులు స్వైర విహారం చేశాయి. దాదాపు ఆరు ఏనుగులు ఈ ప్రాంతంలో మామిడి కొమ్మలు, వరి, టమాటా పంటలను తొక్కి నాశనం చేశాయి. బాలిరెడ్డిగారిపల్లెకు చెందిన రైతులు మనోజ్, ప్రవీణ్, రమేష్ సాగు చేసిన పంటలను ధ్వంసం చేశాయి. ముఖ్యంగా ప్రవీణ్‌కు చెందిన వరి, టమాటా పంటలను తొక్కి వేయడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. అటవీ అధికారులు స్పందించి ఏనుగుల బారి నుంచి పంటలను రక్షించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక

శ్రీరంగరాజపురం: రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా క్రీడలకు మండలంలోని గంగమ్మగుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం కే.కళావతి తెలిపారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులను శనివారం పాఠశాలలో అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అనంతపురం జిల్లా జిల్లా, ఉరవకొండలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు కె.హేమంత్, విష్ణు, యోగనందం పాల్గొననున్నట్టు తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు లోకనాథంను ప్రత్యేకంగా అభినందించారు.

మూగ జీవుల వైద్యంపై ప్రభుత్వ వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వ్యాధులు సోకితే సరైన చికిత్స అందక పాడి పశువులు అల్లాడుతున్నాయి. వాటికి వైద్యం అందించలేక పాడి రైతులు ఆవేదన చెందుతున్నారు. జీవనోపాధి కోసం పోషిస్తున్న పాడి పశువులు వ్యాధులతో బాధపడుతుంటే చూడలేక పశుపోషకులు ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రైవేటు వైద్యులకు రూ.వేలల్లో ఫీజులు ముట్టజెప్పినా ఫలితం లేకపోతోంది. ఫలితంగా పశు సంపదకు నష్టం వాటిల్లి, పాడి పరిశ్రమ దెబ్బతింటోంది. పాడి రైతులు జీవనోపాధి కోల్పోవాల్సిన దుస్థితి నెలకొంటోంది.





మూగ నేస్తం.. అందని వైద్యం

- పాడి పశువులకు వైద్యం కరువు
- మధ్యాహ్నానికే ఆస్పత్రులకు తాళం
- ఆపై నకిలీ డాక్టర్లదే రాజ్యం
- వికటిస్తున్న వైద్యం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పశువులకు ఉచిత వైద్యం కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులు పక్కదారి పడుతున్నాయి. ప్రభుత్వ మందులను ప్రైవేటు వ్యక్తులు అమ్ముకుని, సొమ్ము చేసుకుంటున్నారు. రోగ నిర్ధారణ పరీక్షలు చేయడం మానేశారు. పాడి రైతులు తమ పశువులను ఆస్పత్రులకు తీసుకు వచ్చినా మందుల్లేవని, బయట కొనుగోలు చేసుకోమని, చీటీలు రాసి ఇచ్చి, కమీషన్లు కొట్టేస్తున్నారు.

పాడి పరిశ్రమే ఆధారం

జిల్లాలో పాడి పరిశ్రమపై ఆధారపడి సుమారు 3 లక్షల కుటుంబాలు జీవిస్తున్నాయి. పాడి పోషణ ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాలను నడుపుతున్నాయి. గత ఐదేళ్ల కాలంలో ఈ పాడి పరిశ్రమ మరింత వృద్ధి చెందింది. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 1,036 గేదెలు, 4.67 లక్షల పాడి ఆవులున్నాయి. వీటి ద్వారా 18 లక్షల నుంచి 20 లక్షల వరకు పాల సేకరణ జరుగుతోంది. తద్వారా వచ్చే ఆదాయంతోనే లక్షలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. అయితే పాడి పశువులకు వ్యాధులు వస్తే నయం చేసుకోవడానికి రైతులు సొమ్మసిల్లిపోతున్నారు.

పశు వైద్యం కరువు

జిల్లాలో జిల్లా పశువుల ఆస్పత్రి, ఏరియా పశు వైద్యశాలలు, వెటర్నరీ డిస్పెన్సరీ వైద్యశాలలు, రూరల్ లైఫ్‌స్టాక్ యూనిట్లు, రైతు భరోసా కేంద్రాలు 455 వరకు ఉన్నాయి. వీటి పరిధిలో మండల పశు వైద్యాధికారులు 68 మంది, ఏడీలు 14, ఏహెచ్‌ఏలు 282 మంది, గోపాలమిత్రలు 114 మంది ఉన్నారు. అయితే కొందరి వైద్యుల అలసత్వం, ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వెరసి పశువైద్యానికి సుస్తీ చేసింది. ఉదయం 9, 10 గంటలకు వచ్చి 11 గంటలు, మధ్యాహ్నం 1 గంటకు ఆస్పత్రులకు తాళం వేసి వెళ్లిపోతున్నారు. లేకుంటే సిబ్బందిని ఆస్పత్రికి కాపాలా పెట్టి వెళ్లిపోతున్నారు. దీంతో పశువైద్యం పూర్తిగా కొరవడుతోంది. పాడి రైతులు పశువులకు ఉచిత వైద్యం కోసం నానా తిప్పలు పడుతున్నారు.

ప్రైవేటు వైద్యమే దిక్కు...

జిల్లాలో పలు చోట్ల పశుపోషకులకు ప్రైవేటు వైద్యులే దిక్కుగా మారుతున్నారు. మధ్యాహ్నం పైగా ప్రభుత్వ వైద్యం వారికి పూర్తిగా అందడం లేదు. వైద్యులు మీటింగ్ పేరుతో విధులకు డుమ్మా కొడుతున్నారు. పశువులకు జబ్బు చేస్తే రైతులు ప్రైవేటు డాక్టర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. లేకుంటే వాళ్లకు ఫోన్ చేసి ఇంటి వద్దకు రప్పించుకుంటున్నారు. వారి ద్వారా పశు వైద్య సేవలు పొందుతూ రూ.వేలల్లో ఫీజులు చెల్లించుకుంటున్నారు. ఇలాంటి తరుణంలో వీహెచ్‌ఏలు కూడా స్పందించడం లేదని పలువురు పాడి రైతులు వాపోతున్నారు. వీరి నిర్లక్ష్యం కారణంగా నకిలీ డాక్టర్లు పుట్టగొడుగులా పుట్టుకొస్తున్నారు. ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది రావడం లేదని రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నకిలీ వైద్యులతో తంటాలు..

మందులు పక్కదారి..?

కొంత మంది వైద్యులు మధ్యాహ్నానికే ఇంటి బాట పట్టడంతో ప్రైవేటు, నకిలీ డాక్టర్లకు చేతి నిండా పనిపడుతోంది. నకిలీ వైద్యులు కొందరు ప్రభుత్వ వైద్యులతో చేతులు కలిపి, ప్రభుత్వ పశు వైద్యశాలలు, కేంద్రాలకు సరఫరా చేసే మందులను విచ్చలవిడిగా దారి మళ్లిస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులు ఏ మందు కావాలన్నా ప్రభుత్వ పశు వైద్య కేంద్రాల నుంచే పట్టుకెళుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ మందులను ప్రైవేటు షాపుల్లో తీసుకొచ్చామని రైతులు దగ్గర డబ్బులు గుంజేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. గర్భకోశవ్యాధుల నివారణ మందులు, లివర్ సిరఫ్, కాల్షియం, జ్వరం మాత్రలు, పారుడురోగ నివారణ మందులు, నట్టల నివారణ, కడుపు ఉబ్బరం మందులు అధికంగా దారిమళ్లుతున్నట్లు సిబ్బందే ఆరోపిస్తున్నారు. ఉచితంగా వేయాల్సిన టీకాలను కూడా డబ్బులకు అమ్మేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ప్రైవేటు వైద్యుల నుంచి ప్రభుత్వ వైద్యాధికారులకు వాటాలు వెళుతున్నాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో వైద్యులు మందులు, మాత్రలు ఇక్కడ లేవని, బయట కొనుగోలు చేసుకోమని చీటీలు రాయిస్తున్నారు. ఈ వ్యవహారం అందరికీ తెలిసినా ఏమి తెలియనట్లు వ్యవహరించడంపై విమర్శలకు దారితీస్తోంది.

జిల్లా సమాచారం

జిల్లా పశువుల ఆస్పత్రి	1
ఏరియా పశు వైద్యశాలలు	14
వెటర్నరీ డిస్పెన్సరీ వైద్యశాలలు	68
రూరల్ లైఫ్ స్టాక్ యూనిట్లు	75
రైతు భరోసా కేంద్రాలు	297
పాడి ఆవులు	4.67 లక్షలు
గేదెలు	1036

జిల్లాలో పాడి పశువులకు మంచి గిరాకీ ఉంది. ఈ క్రమంలో ఒక్కొక్క ఆవు రూ.80 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు పలుకుతోంది. అంత ధర పెట్టి కొనుగోలు చేసిన పశువులకు వైద్యం సక్రమంగా అందడం లేదు. కొందరు నకిలీ కేటుగాళ్లు ఎలాంటి అర్హత లేకుండా పాడి ఆవులకు వైద్యం చేస్తున్నారు. విచ్చలవిడిగా యాంటీ బయోటిక్స్ వాడేస్తున్నారు. దీంతో పాడి పశువుల్లో సంతానోత్పత్తి దెబ్బతింటోంది. విద్యార్హత లేని వ్యక్తులు సైతం పశు వైద్యులుగా చలామణి అవుతూ పాడి పశు సంపదను నాశనం చేస్తున్నారు. ఈ విషయం తెలియని తాము ఆర్థికంగా నష్టపోతున్నామని పాడి రైతులు కంట తడిపెడుతున్నారు.

మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం



పశువైద్యశాలల్లో సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్నాం. సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నాం. పాడి పరిశ్రమకు ఇబ్బంది లేకుండా వైద్య సేవలు అందిస్తున్నారు. మందులు పక్కదారి పట్టడంపై విచారిస్తాం. నకిలీ డాక్టర్లు, ఎలాంటి అర్హత లేకుండా వైద్యం చేస్తున్నారంటే మా దృష్టికి తీసుకోరావాలి. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తాం.

- అరిఫ్, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి, చిత్తూరు

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 71,249 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 22,901 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.04 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారికి 18 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారు 3 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

స్విమ్స్‌లో పలు కోర్సులకు ఫైనల్ కౌన్సెలింగ్

తిరుపతి సిటీ: స్విమ్స్ వర్సిటీలో బీఎస్సీ నర్సింగ్, బ్యాచులర్ ఆఫ్ ఫిజియోథెరఫీ, బీఎస్సీ అలైడ్ హెల్త్ సైన్స్ కోర్సులకు 3వ విడత ఫైనల్ ఆఫ్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియను ఈనెల 26న నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఏపీఈఏఎమ్‌సెట్–2025 ర్యాంకు, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు లోబడి సీట్లు కేటాయించనున్నట్టు తెలియజేశారు. అర్హులైన అభ్యర్థులు స్విమ్స్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

తాళంబేడులో ఆగని టీడీపీ రగడ

- సర్దుబాటుకాని యవ్వారం
- మళ్లీ పోలీసులకు ఫిర్యాదు చేసిన ఓ నాయకుడు



నేనొక్కడినే

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు మండలం, తాళంబేడు పంచాయతీలో టీడీపీ నేతల మధ్య రేగిన రగడ ఆగనంటోంది. మండల నేతలు పంచాయితీ చేసినా మళ్లీ వివాదం తెరపైకి వచ్చింది. ఓ నేత పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వివాదం మొదటికొచ్చింది.

రగడ ఏంటంటే?

తాళంబేడులోని ఓ టీడీపీ నేత మద్యం విక్రయిస్తున్నారని ఇద్దరు నేతలు ప్రొబిషన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో గొడవ మొదలైంది. ఈ ఫిర్యాదు ఆ ఇద్దరు నేతలే చేశారని మద్యం విక్రయిస్తూ ఆపేసిన నేత చెవిలో పడింది. ఆ నేత వాళ్లకు సంబంధించిన గోకులం షెడ్డు, అంగన్‌వాడీ ఇతరాత్ర వాటిపై ఫిర్యాదు చేయడంతో వివాదం తారస్థాయికి చేరింది. చివరకు పోలీస్ స్టేషన్‌కు కూడా చేరింది. గురువారం బీఎస్‌ఆర్‌పేటలో ఇరువర్గాల నేతలను పిలిచి మండల నేతలు పంచాయితీ చేశారు. సర్దుబాటు చేశామని మండల నేతలు ఊపిరి పీల్చుకున్నారు. ఆ లోపు మళ్లీ ఆ ఇద్దరిలో ఓ నేత పోలీసులకు ఫిర్యాదు చేయడంతో యవ్వారం మళ్లీ మొదటికొచ్చింది. మూడు రోజుల తర్వాత మళ్లీ పంచాయితీకి ఫిక్స్ నిర్వహించేందుకు మండల నేతలు ఖరారు చేశారు. కాగా ఇదంతా ఓ మండల నేత నడిపిస్తున్నారని టీడీపీ నేతలు భావిస్తున్నారు.

బెంగళూరులో స్థిరపడిన నేతే ఎన్నికల సమయంలో పంచాయతీలో టీడీపీని గటెక్కించేందుకు సాయశక్తుల కృషి చేశారని పలువురు టీడీపీ నాయకులు అంటున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టారని చెబుతున్నారు. కూటమి అధికారంలోకి రావడంతో మంగాపురంలోని మరో నేత పంచాయతీలో పెత్తనం చలాయిస్తున్నారని ఓ వర్గం మండిపడుతోంది. వర్క్‌లు, సిబ్బందిపై పెత్తనం.. ఇలా అన్నింటిలోనూ అన్నీ తానై తల దూరుస్తున్నారని ఆ వర్గం ఆగ్రహానికి గురవుతోంది. ఎన్నికల సమయంలో లక్షలాది రూపాయలు తామే ఖర్చు చేస్తే.. తళుక్కుమనే వారికి పెత్తనం ఇస్తే ఎలా అని మండిపడుతోంది. ఎన్నికల రోజు తలదాచుకున్న వ్యక్తులు, జేబులో నుంచి రూపాయి ఎత్తని వ్యక్తులు ఈ రోజు పంచాయతీలో తామే నాయకులమని చెబితే ఎలా అని ఆ వర్గం ప్రశ్నిస్తోంది. కాగా బెంగళూరులో ఉండే వాళ్లు.. ఇక్కడేమి రాజకీయం చేస్తారని మరో వర్గం దీటుగా సమాధానం ఇస్తోంది. ఇంతకీ ఈ పోరులో ఎవరు గెలుస్తారో వేచి చూడాలి మరీ.

పల్లె పోరు ఎఫెక్ట్

ఈ వివాదం వెనుక పల్లెపోరు ఎఫెక్ట్ ఉందని పలువురు టీడీపీ నేతలు చెబుతున్నారు. ఇదివరకు ఇద్దరు మండల నేతలు మాత్రం జెడ్పీటీసీకి పోటీపడేవారు. పల్లె పోరు జనవరి ఉండడంతో మరో కొత్త నేతను ఆ పార్టీలోని కొందరు తెరపైకి తీసుకొచ్చారు. తాళంబేడు పంచాయతీ, మంగాపురానికి చెందిన ఆ నేత బెంగళూరులో స్థిరపడ్డారు. ఆర్థికంగా మంచి పలుకుపడి ఉంది. పంచాయతీని బాగానే లీడ్ చేస్తున్నారు. ఈ నేత కూడా జెడ్పీటీసీ టిక్కెట్టు ఆశిస్తున్నారని ఓ మండల నేత చెవిలో పడింది. ఈ వివాదాన్ని అదునుగా తీసుకుని సదరు మండల నేత తాళంబేడు పంచాయతీలో ఆ వర్గాన్ని తొక్కే ప్రయత్నంలో పడ్డారని వారు చెబుతున్నారు. కొత్త అభ్యర్థిగా తెరపైకి వచ్చిన నేత మద్దతు మద్యం విక్రయిస్తూ ఆపేసిన నేతకు ఉంది. దీంతో మద్యం ఆపేసిన నేతకు పోలీసుల ద్వారా ఆ మండల నేత ద్వారా ఒత్తిడి తెచ్చే ప్రయత్నం జరుగుతోందనే విమర్శలు వస్తున్నాయి. జెడ్పీటీసీ అభ్యర్థిగా కొత్త నేతను తెరపైకి తీసుకోరావడం వెనుక పంచాయతీలోని ఇద్దరు నేతల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. మద్యం విక్రయిస్తూ ఆపేసిన నేతను పంచాయతీలో నామరూపాలు లేకుండా చేయాలని ఆ మండల నేతను ఉసిగొలిపి ఇదంతా చేయిస్తున్నారనే ప్రచారం ఉంది.

ఇండస్ట్రియల్ విజిట్‌కు మహిళా వర్సిటీ విద్యార్థులు

తిరుపతి రూరల్ : పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విద్యార్థులు శనివారం రేణిగుంట వద్దనున్న దక్షిణ మధ్య రైల్వే క్యారేజ్ రిపేర్ షాపు (సీఆర్‌ఎస్)కు ఇండస్ట్రియల్ విజిట్‌కు వెళ్లారు. వారికి అధికారులు మెకానికల్ వ్యవస్థలు, రైల్వే నిర్వహణ కార్యకలాపాలపై ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. ఇంజినీరింగ్ కళాశాల డైరెక్ట్ ప్రొఫెసర్ పి.మల్లికార్జున మెకానికల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్ పి.స్నేహలత మాట్లాడుతూ ఇక్కడి పనులను పరిశీలించడం వల్ల విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెరుగుతుందన్నారు. బోగీ అసెంబ్లీ, వీల్సెట్ రీకండిషనింగ్, వెల్డింగ్ కార్యకలాపాలు వంటి అనేక విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భన మెటీరియల్ హ్యాండ్లింగ్, ఆటోమేషన్, క్వాలిటీ కంట్రోల్ ప్రక్రియలపై విద్యార్థులకు స్పష్టమైన అవగాహన ఏర్పడింది. హైడ్రాలిక్ ప్రెస్‌లు, సీఎన్‌సీ యంత్రాలు, నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ పద్ధతుల ప్రదర్శనలు విద్యార్థులను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.

ప్రీ పీహెచ్‌డీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో పీహెచ్‌డీ డిగ్రీ కోసం పరిశోధన చేస్తున్న ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విద్యార్థులు ప్రీ పీహెచ్‌డీ పరీక్షలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలని పరీక్షల నియంత్రణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు అక్టోబర్ 15 లోపు రూ.3,715 ఫీజు చెల్లించాలని, అపరాధ రుసుముతో అక్టోబరు 30 వరకు గడువు ఉంటుందని, నవంబర్‌లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. మరిన్ని వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

తిరుమల పవిత్రతను కాపాడుదాం

తిరుమల: తిరుమల పవిత్రత, ప్రశాంతత కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ముఖ్యంగా భక్తులకు సరైన సమాచారం అందించే విషయంలో మీడియా పాత్ర మరింత కీలకమైనదని టీటీడీ అదనపు ఈఓ సి.హెచ్.వెంకయ్య చౌదరి అన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో శనివారం టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణతో కలిసి మీడియా ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

కంబైన్డ్ నోటిఫికేషన్ తుది జాబితా విడుదల

తిరుపతి తుడా: చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించి ఎస్వీ వైద్య కళాశాల, రుయా, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలోని స్కూల్ ఆఫ్ నర్సింగ్, శ్రీపద్మావతమ్మ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల పరిధిలో గతంలో విడుదల చేసిన కంబైన్డ్ నోటిఫికేషన్‌కు సంబంధించి తుది జాబితాను విడుదల చేసినట్లు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు తెలిపారు. ఎమైనా ఫిర్యాదులు ఉంటే ఈనెల 26 సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ప్రిన్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని ఆయన సూచించారు.